# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 2, మార్చి 2026


బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనంపై

## నిషేధాజ్ఞల కొనసాగింపు

- అనుమతి లేని డ్రోన్లు, డీజే సౌండ్స్‌పై కఠినచర్యలు
- రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝ



మంచిర్యాల, మార్చి 1, ప్రభాతవార్త

సాధారణ పౌరులు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల,పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి కొందరు వ్యక్తులు అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారనే పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మద్యం మత్తులో వీధులు, రోడ్లపై అసభ్య పదజాలంతో ప్రవర్తించడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని,ప్రజల భద్రత దృష్ట్యా ఈ నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు మార్చి 1 నుంచి ఏప్రిల్ 1 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత బీఎన్‌ఎస్ సెక్షన్ 223, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం,1348 ఫసలీ నిబంధనల ప్రకారం నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన (మిగతా 2లో..)

## ఆత్మ విశ్వాసంతోనే విజయం..



- కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు
- త్వరలో పదోతరగతి పరీక్షలు..
- భయం వీడి.. సన్నద్ధం కావాలని నిపుణుల సూచన

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 1, ప్రభాతవార్త :

**పరీక్షల సీజన్ రానే వచ్చింది. ఇట్పికే ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థు లకు పరీక్షలు పరీక్షలు కొనసాగుతున్నాయి. త్వరలో పది విద్యా ర్థులకు పరీక్షలు రానున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్ష లు కోసం విద్యార్థులు ప్రిపేర్ అవ్వాల్సిన తీరుపై నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు.**

### ఆందోళన వద్దు..

ఏడాదిపాటు ప్రశాంతంగా చదువుకున్న విద్యార్థు లకు పబ్లిక్ పరీక్షలంటే ఒకింత ఆందోళన, భయం కలుగుతుంది. ఈ సమయంలోనే విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెరుగుతుంది. అత్యధిక మార్కు లు, గ్రేడులు సాధించాలనే పట్టుదల ఒకవైపు, లక్ష్యాలను చేరుకుంటామా లేదా అనే ఆందోళన మరోవైపు. ఈ తరుణంలో భయం వీడి ఆత్మ విశ్వా సంతో లక్ష్యసాధనపై దృష్టి పెడితే విజయం సాధిం చవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

### పక్కా ప్రణాళికతో..

ఏడాది పాటు చదువుకున్న పాఠాలను క్రమపద్ద తిలో పునఃశ్చరణ చేసుకుంటే మంచి మార్కులు సాధించే అవకాశాలు మెండుగా ఉంటాయి. కొంత మంది విద్యార్థులు పరీక్షలకు ముందు గంటల తర బడి చదువుతుంటారు. పరీక్షకేంద్రంలోకి వెళ్లగానే చదివిన అంశాలు మర్చిపోతుంటారు. ఇలాంటి సమయంలోనే విద్యార్థులు ధైర్యంతో ఆత్మవిశ్వాసంతో ఉండాలి. ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా పరీక్షా పత్రాలను ఒకసారికి రెండు సార్లు చదువుకుని ముందుగా తనకు తెలిసిన జవాబులను రాసుకోవాలి. తరువాత గుర్తుకు రాని విషయాలను జ్ఞప్తికి తెచ్చుకుని సమాధానాలు రాసుకోవాలి. ఆందోళనలో ఉంటే మనకు తెలిసిన విషయాలను కూడా మరచిపోయే ప్రమాదముంది. పరీక్షలు రాసేటప్పుడు సమయపాలన కూడా చాలా అవసరం. నిర్ణీత గడువులో అన్ని ప్రశ్నాలకు సమాధానాలు రాసుకునే విధంగా సమయాన్ని కేటాయించుకోవాలి. పరీక్షల సమయంలో చదు వుపై తప్ప మరే ఇతర ఏ విషయాల పై మనసు పెట్టకూడదు.

### ఆరోగ్యం ముఖ్యం..

ఆర్యోగ పరిరక్షణకు సరైనా పౌష్టికాహారం తీసు కోవాలి. పరీక్షల సమయంలో జంక్ ఫుడ్కు దూరంగా ఉంటే మంచిది. పరీక్షల సమయంలో రేయిం బవళ్లు చదివి నిద్ర లేకుండా చేసుకోవద్దు. విద్యార్థు లు పరీక్షల సమయంలో కూడా ఎప్పటి మాదిరిగానే ప్రశాంతమైన నిద్రపోవాలి.. అని నిపుణులు సూచిస్తున్నారు.



## అంగరంగ వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం

* వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించిన ఎంపీ గోడం నగేష్

బజార్‌హత్నూర్, మార్చి 01, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని జాతర్ల గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్ ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ఘనంగా (మిగతా 2లో..)

## సరిపడా భోజనం పెట్టట్లేదని విద్యార్థుల ఆందోళన

మంచిర్యాల, మార్చి 1, ప్రభాతవార్త



ప్రతిరోజూ తమకు సరిపోయే భోజనం పెట్టట్లేదని విద్యార్థులు ఆందోళన చేస్తూ పాఠశాల ముందు ధర్నాకి దిగిన సంఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సాయి కుంట బిసి సమీకృత బాలుర వసతి గృహంలో జరిగింది. వార్డెన్ ఇష్ట రాజ్యాంగ వివరిస్తూ తమల్ని పట్టించుకోవడం లేదని, (మిగతా 2లో..)

## రంజాన్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

★ కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 1, ప్రభాతవార్త

రంజాన్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్ అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో రంజాన్ పండుగ నేపథ్యంలో జిల్లా ఎస్పీ నీతిక పంత్ ఆదేశాల మేరకు ముస్లిం పెద్దలు, చిరు వ్యాపారస్థులతో కాగజ్‌నగర్ డీఎస్పీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రంజాన్ పండుగ సందర్భంగా నిర్ణీత సమయాల వరకు మాత్రమే దుకాణాలు తెరిచి ఉంచాలని, ఎలాంటి అనుమానిత వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పవిత్రమైన రంజాన్ మాసాన్ని నియమ నిష్టలతో, శాంతియుత వాతావరణంలో (మిగతా 2లో..)



## అంగరంగ వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించబడింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా జరిగిన కళ్యాణ మహోత్సవంలో ఎంపీ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు గాయత్రి హోమాన్ని కూడా నిర్వహించారు. ఈ వేడుకకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మెస్రం మాధవ్, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటిపల్లి గంగాధర్ రావు, ముఖ్య నాయకులు రాజేశ్వర్, వెంకన్నా, నానం రమణ, సూది నందు, కల్యాణ్, జాం సింగ్ తదితరులు పాల్గొన్నారు. భక్తుల రాకతో జాతర్ల గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

## సరిపడా భోజనం పెట్టట్లేదని విద్యార్థుల ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

తమకు సరిపడా భోజన సౌకర్యాలు చూడటం లేదని, విద్యార్థులు వాపోయారు. వసతి గృహంలో పారిశుధ్య లోపంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొందని, దీంతో అనారోగ్యాలకు గురవుతున్నామని, వసతి గృహంలో వార్డెన్ చెప్పిందే వినాలని ఆంక్షలు విధించినట్లు విద్యార్థులు తెలిపారు. ఇలాంటి వార్డెన్ పై తగు చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు.

## రంజాన్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

జరుపుకోవాలని కోరారు. ప్రజల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ కుమారస్వామి, ఎస్ఐలు సుధాకర్, ముస్లిం పెద్దలు మరియు వ్యాపారస్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమం, విద్యాభ్యాసానికి అత్యంత ప్రాధాన్యత

### - మంచిర్యాల జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి

మంచిర్యాల, మార్చి 1, ప్రభాతవార్త

సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం, విద్యాభ్యాసానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బాలుర సమీకృత వసతి గృహంపై వెలువడిన వార్తల నేపథ్యంలో ఆదివారం వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడి భోజన సరఫరా, త్రాగునీరు, వసతి, వంటశాల ఏర్పాట్లను పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి మాట్లాడుతూ వసతి గృహంపై వెలువడిన వార్తల నేపథ్యంలో వసతి గృహాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించడం జరిగిందని, హాస్టల్ స్థాయిలో పర్యవేక్షణ, సమన్వయంలో తాత్కాలిక లోపం కారణంగా భోజన సరఫరా, కొంతమంది ప్రాథమిక సౌకర్యాలలో అంతరాయం ఏర్పడినట్లు గమనించడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తక్షణమే సరిదిద్దే చర్యలు చేపట్టడం జరిగిందని, విద్యార్థులకు నిరంతర భోజన సరఫరా, శుద్ధమైన త్రాగునీరు, వసతి, వంటశాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం వసతి గృహంలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, సంబంధిత వసతి గృహ సంక్షేమ అధికారి, సిబ్బందిని కఠినంగా హెచ్చరించడం జరిగిందని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతమైతే బాధ్యులపై శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ రోజు జరిగిన సంఘటనకు బాధ్యులైన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనంపై

# నిషేధాజ్ఞల కొనసాగింపు

(మొదటిపేజీ తరువాయి)

వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో డీజే సౌండ్స్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగించినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు భారీ శబ్దంతో కూడిన డీజే సౌండ్స్ వినియోగంపై నిషేధం విధించినట్లు తెలిపారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ కోసం డీజే సౌండ్స్ వినియోగిస్తున్నట్లు గమనించామని తెలిపారు. అయితే కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ నిషేధాజ్ఞలు కూడా మార్చి 1 నుంచి ఏప్రిల్ 1 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 223, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు, ఈ కాలంలో రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బంద్‌ల పేరిట సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించేందుకు ఒత్తిడి చేయడం లేదా బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.



## శబరిమాత ఆశ్రమ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### - పిల్లలను ఆన్‌లైన్ వ్యసనాలకు దూరంగా ఉంచాలి: ఎమ్మెల్యే పిలుపు

నేరడిగొండ, మార్చి 01, ప్రభాతవార్త:

బోథ్ మండలంలోని కన్నుగట్ట గ్రామంలో నిర్వహించిన సద్గురు శబరిమాత ఆశ్రమ వార్షికోత్సవ వేడుకలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శబరిమాత భక్తుడిగా తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. నేటి తరం పిల్లలు ఆన్‌లైన్ యుగానికి, స్మార్ట్‌ఫోన్ వ్యసనాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని ఆయన సూచించారు. ప్రజలు భక్తి మార్గంలో నడవాలని, ఆధ్యాత్మికత ద్వారానే మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు స్వామి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచులు రూప్‌చంద్, రవి, గంగమల్లు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## శబరిమాత ఆశ్రమంలో షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ

### - భక్తుల కోరిక మేరకు వెంటనే పనులు ప్రారంభం

నేరడిగొండ, మార్చి 01, ప్రభాతవార్త:

బోథ్ మండలంలోని కన్నుగట్ట గ్రామంలో గల శబరిమాత ఆశ్రమంలో భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం భూమిపూజ చేశారు. ఆశ్రమ భక్తులు షెడ్డు నిర్మించాలని కోరగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తుల కోరిక మేరకు రేపటి నుండే షెడ్డు నిర్మాణ పనులను సైతం ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు స్వామి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, గంగమల్లు, తదితరులు పాల్గొన్నారు.



## కన్నుగట్ట శబరిమాత ఆశ్రమంలో షెడ్ నిర్మాణానికి ఆడే గజేందర్ భూమిపూజ

### - రూ.10 లక్షలతో పనులు ప్రారంభం

నేరడిగొండ, మార్చి 01, ప్రభాతవార్త:

బోథ్ మండలంలోని కన్నుగట్ట గ్రామంలో శనివారం భక్తుల ఆధ్వర్యంలో జరిగిన సద్గురు శబరిమాత రెండో వార్షికోత్సవ వేడుకలకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తుల కోరిక మేరకు వెంటనే స్పందించిన ఆయన, అమ్మవారి ఆలయ పరిసరాలలో భక్తులకు వసతి సౌకర్యార్థం రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న షెడ్‌కు భూమిపూజ చేశారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ.. ప్రజల విశ్వాసం, భక్తి, సేవాభావంతో చేసే ప్రతి పనికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. శబరిమాత ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం నిరంతరం కొనసాగిస్తానని పేర్కొన్నారు. భక్తుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్న నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని స్థానికులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బోరిగామ పోచమ్మ ఆలయానికి మట్టి రోడ్డు నిర్మాణం

### - సర్పంచ్ ఆసిఫ్ ఖాన్ చొరవతో భక్తుల కష్టాలు దూరం

సిరికొండ, మార్చి 01, ప్రభాతవార్త:



ఇచ్చోడ మండలంలోని బోరిగామ గ్రామంలో గ్రామ దేవత పొచ్చమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలో మట్టి రోడ్డును సర్పంచ్ ఆసిఫ్ ఖాన్ చొరవతో నిర్మించారు. గ్రామంలోని భక్తి భావాలను గౌరవిస్తూ, భక్తుల సౌకర్యార్థం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ సమస్యను ఆయన స్వయంగా పర్యవేక్షి ంచి పూర్తి చేయించారు. గ్రామ దేవత దర్శనానికి వెళ్లే భక్తులు, ముఖ్యంగా వర్షాకాలంలో బురద కారణంగా అనేక ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గమనించిన సర్పంచ్ ఆసిఫ్ ఖాన్, తక్షణమే స్పందించి జేసీబీ యంత్రాలతో రోడ్డును చదును చేయించి, మొరం పోయించి భక్తులకు మార్గం సుగమం చేశారు. గ్రామస్తుల చిరకాల కోరికను తీర్చినందుకు గాను సర్పంచ్‌ను గ్రామస్తులు అభినందిస్తున్నారు. దేవాలయం వద్ద మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన చూపిన చొరవ మిగతా వారికి ఆదర్శమని స్థానికులు కొనియాడారు.

# ప్రజలందరూ అపోహలు వీడి నేత్ర అవయవ దానానికి ముందుకు రావాలి

**బెల్లంపల్లి, మార్చి 01, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణం బాబు క్యాంప్ బస్తీ వాస్తవ్యులు నేత్రదాత కీ.శే. బింగి అశోక్ కుమార్ సంస్మరణ సభ బెల్లంపల్లి పట్టణం పద్మశాలి భవన్‌లో జనహిత సేవా సమితి, సదాశయా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సదశయా ఫౌండేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రాం రెడ్డి హాజరై నేత్రదాత కీ.శే. బింగి అశోక్ కుమార్‌కు నివాళి అందించి నేత్ర దాత కీ.శే. బింగి అశోక్ కుమార్ కుటుంబ సభ్యులు భార్య బింగి రాజకుమారి, తల్లి బింగి వెంకమ్మ, కుమారులు కొడళ్ళు బింగి శ్రావణ్ కుమార్‌తేజస్విని, బింగి సంతోష్ కుమార్‌మోనిక, కుటుంబ సభ్యులని అభినందించి ప్రశంసా పత్రం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాం రెడ్డి మాట్లాడుతూ ప్రతి మనిషికి మరణం తప్పదని జీవించినపుడు ఇతరులకి సహాయపడాలని కీ.శే. బింగి అశోక్ కుమార్ నేత్రదానం ద్వారా మరణించిన జీవిస్తూ వారి నేత్రాల ద్వారా ఈ ప్రపంచాన్ని చూస్తున్నారని వీరి స్ఫూర్తితో మరింత మంది నేత్ర అవయవ దానాలకి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి



అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ నేత్రదాత కీ.శే. బింగి అశోక్ కుమార్ కుటుంబ సభ్యుల స్ఫూర్తితో ప్రజలందరూ మరణించిన తరువాత నేత్ర, అవయవ, శరీరాలు వృధా కాకుండా దానం చేసి సమాజానికి ఉపయోగపడాలని నేత్రదానం చేసినపుడు మరణించిన తరువాత ఎనిమిది గంటల లోపు మరణించిన వ్యక్తి యొక్క కళ్లలోని కార్నియా పొరని మాత్రమే సేకరిస్తారని నేత్ర దానం ద్వారా ఇద్దరు అందులకి చూపు ప్రసాదించి వారి ద్వారా మరణించిన ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం ఉందని ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వ్యక్తి బ్రెయిన్ డెడ్ అయినప్పుడు వారి అవయవాలు దానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో అవయవాలు అవసరం ఉన్న ఎనిమిది మంది ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని అలాగే శరీర దానం ద్వారా పార్థివ దేహాన్ని వైద్య కళాశాలకి అందించి కొన్ని వేల వైద్య విద్యార్థుల బోధనకు ఉపయోగపడి ప్రజల వైద్య చికిత్సకి ఉపయోగపడే అవకాశం ఉందని ప్రజలందరూ అపోహలు వీడి నేత్ర, అవయవ, శరీర దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు బిరా మురళి, బింగి సత్యనారాయణ, బింగి పోశం, ఇతర కుటుంబ సభ్యులు, మాజీ కౌన్సిలర్ నీలి కృష్ణ, సామాజిక కార్యకర్త గజేల్లి మోహన్, జనహిత సేవా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కాంపెల్లి విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఇప్ప రవి, ఉపాధ్యక్షులు హనుమాండ్ల రమాదేవి, కందుల రాజన్న, కార్యవర్గ సభ్యులు డోలి సుకుమార్, నేత్రదాత కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, ప్రజలు పాల్గొన్నారు.



## భక్తజన సంద్రంగా దేగామ అడెల్లి పోచమ్మ ఆలయం

**● సౌకర్యాల లేమితో భక్తుల ఇక్కట్లు ● అభివృద్ధి పై ఆవేదన**

**బజార్‌హత్నూర్, మార్చి 01, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని దేగామ గ్రామ సమీపంలో వెలసిన సుప్రసిద్ధ అడెల్లి మహా పోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తజన సంద్రంగా మారాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అయితే, పురాతనమైన ఈ దేవస్థానం సరైన మౌలిక సదుపాయాలు లేక వెలవెలబోతోంది. గ్రామస్తులు, దాతల సహకారంతో ఇప్పుడిప్పుడే అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ, నిధుల కొరతతో అనేక చోట్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ముఖ్యంగా ఆలయానికి వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రతను తట్టుకోలేక, భక్తులు బస చేసేందుకు కనీస వసతులు లేకపోవడంతో చెట్ల కింద పారీలు ఏర్పాటు చేసుకుని మొక్కులు తీర్చుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.



## అడెల్లి మహా పోచమ్మను దర్శించుకున్న ఆర్డీవో, మాజీ ఎంపీ

**- తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ కమిటీ**

**సారంగాపూర్, మార్చి 01, ప్రభాతవార్త:**

మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అడెల్లి మహా పోచమ్మ ఆలయాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు సందర్శించారు. నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి, మాజీ ఎంపీ సోయం బాపూరావు వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి భూమన్న, పాలకమండలి చైర్మన్ భుజంగరావు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ ఏ. రాజేష్, ధర్మకర్తలు కోయిటికంటి లక్షి ్మ, లస్మన్న, బట్టు భోజన్న, ముస్కు నర్సా రెడ్డి, ప్రభాకర్ గౌడ్, ఆలయ సిబ్బంధ్ధి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత

**జైపూర్, మార్చి 1, ప్రభాతవార్త**

ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వేలాల గ్రామ సర్పంచ్ డేగ స్వప్న అన్నారు. గ్రామ పంచాయతీలోని 6 వార్డ్‌లో బందేలు దొడ్డి దగ్గర ఉన్న బోర్‌వెల్ చెడి పోవడంతో ఆదివారం మరమ్మత్తులు చేయించి, నూతన మోటర్ బిగించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ డేగ స్వప్న నగేష్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాల అంశాలలో సమస్యలు తలెత్తితే వార్డ్ మెంబర్ ద్వారా తెలియజేయాలని కోరారు. త్వరితగతిన సమస్య పరిష్కారం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుందిళ్ళ రాజలింగు,వార్డు పెద్దలు పాల్గొన్నారు.



## మున్సిపాలిటీలోని మోదెలలో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన చైర్మన్

**లక్షెట్టిపేట, మార్చి 1, ప్రభాతవార్త**

మున్సిపాలిటీలోని మోదెలలో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి-నరసయ్య, వార్డు కౌన్సిలర్ తోట సువర్ణతో కలిసి పరిశీలించారు. ఆదివారం రోజున మున్సిపాలిటీ 6వ వార్డులో వార్డుకు సంబంధించిన పారిశుద్ధ్య పనులను పరిశీలించి, వార్డుకు సంబంధించి చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు నాలిలా క్లీనింగ్, మంచినీటి సమస్యలు మొదలగు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ.. మున్సిపాలిటీని పట్టణాభివృద్ధి, సుందరీకరణ భాగంలో ముందు వరుసలో ఉంచుతానని అన్నారు. వార్డులో ఏ సమస్య లేకుండా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సూచనలతో వార్డుకు అవసరమైన పనులకు పరిశీలిస్తూ తిరగడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి-నర్సయ్య, వైస్ చైర్మన్ మోత్కూరి రాజేశ్వరివెంకట్ స్వామి, 6వ వార్డు కౌన్సిలర్ తోట సువర్ణ-రమేష్, చిన్నయ్య, పెండెం రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గల్ఫ్ యుద్ధ వాతావరణం: తెలుగు వారందరూ అప్రమత్తంగా ఉండాలి

**జన్నారం, మార్చి 1, ప్రభాతవార్త**

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలుగు వారందరూ అప్రమత్తంగా ఉండాలని జన్నారం మండల గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి అధ్యక్షుడు మగ్గిడి తిరుపతి, ప్రధాన కార్యదర్శి దుమల్ల ఎల్లయ్య కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, గల్ఫ్ దేశాల్లో ఉన్న కార్మికులు అక్కడి ప్రభుత్వాల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ముఖ్యంగా యుద్ధానికి సంబంధించిన వీడియోలు లేదా ఇతర దేశాలకు వ్యతిరేకమైన విషయాలను సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని, అలా చేస్తే అక్కడి చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక ప్రభుత్వం ప్రకటించిన హెల్ప్ లైన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు. స్వదేశంలో ఉన్న కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వారిని ఆందోళన చెందకుండా చూసుకోవాలని తెలిపారు. ఎటువంటి కష్టం వచ్చినా జన్నారం మండల తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు.





జెసిబితో పిచ్చి మొక్కలను తొలగింపు

## పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపు

**ఆసిఫాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:**

రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను పంచాయతీ సిబ్బంది జెసిబితో తొలగించారు. ఆదివారం ఆసిఫాబాద్ మండలంలోని రాజుర గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, తుమ్మ చెట్లతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పంచాయతీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మోతుగూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ బొట్టుపల్లి గోపాల్ ఆదేశాల మేరకు వార్డు సభ్యుడు బోయిరే రాజేందర్, పంచాయతీ సిబ్బంది జేసీబీ సహాయంతో చెట్ల తొలగింపు పనులు చేపట్టారు. దీంతో సమస్య తీరిగిందని వాహనచోదకులు సంతోషం వ్యక్తం చేశారు.

## స్మశాన వాటిక పనులు ప్రారంభం

**తాండూర్, మార్చి 1, ప్రభాతవార్త :**

తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పోచమ్మ కుంట సమీపంలో స్మశానవాటిక నిర్మాణ పనులకు ఆదివారం సర్పంచ్ ముడిమడుగుల సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ నిధులు, దాతల సహకారంతో స్మశాన వాటిక నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, వార్డు సభ్యులు ఎండి జుబైర్, ఉప్పుట్ల దుర్గ చరణ్, నాయకులు శ్రీధర్, రాజేశం, ముష్కే సాగర్, తదితరులు పాల్గొన్నారు.



స్మశాన వాటిక పనులను ప్రారంభించిన సర్పంచ్ సురేష్

# ప్రత్యర్థులను వేధించడం రాజకీయ అనైతిక చర్య

**- బి.ఆర్.ఎస్ పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్ గౌడ్**

**క్యాతన్‌పల్లి, మార్చి 1, ప్రభాతవార్త**

క్యాతన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ ఓటమిని తట్టుకోలేక రాజకీయ ప్రత్యర్థులైన తమ బిఆర్ఎస్ పార్టీ నాయకుల పై, పెద్దపల్లి మాజీ ఎం.పి,చెన్నూరు మాజీ ఎంఎల్ఏ, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌లను వేధింపులకు గురి చేయడం, పోలీసులను ప్రయోగించి అక్రమ కేసులు నమోదు అక్రమ అరెస్ట్‌లకు పాల్పడడం వివేక్ దిగజారుడు రాజకీయాలకు, రాజకీయ అనైతిక చర్యగా పేర్కొంటూ తీవ్రంగా ఖండిస్తున్నామని బి.ఆర్.ఎస్ పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్ గౌడ్, మాజీ సర్పంచ్ జాడి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ పారుపెల్లి తిరుపతిలు అన్నారు. ఆదివారం రామకృష్ణాపూర్ పట్టణంలోని బిఆర్ఎస్ కార్యాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ప్రజల పక్షాన నిలబడి, ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తున్నందుకే బాల్క సుమన్‌ను టార్గెట్ చేశారని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ కక్షతో పాత 12 కేసులకు సంబంధించిన పీటీ వారెంట్లను ఇప్పించడం జరిగిందని అన్నారు. ఒక నాయకుడిని రాజకీయంగా ఎదుర్కోలేక,తప్పుడు కేసులతో జైల్లో పెట్టాలని చూస్తున్నారని అన్నారు. భయపెట్టి నోరు నొక్కేయాలని చూస్తున్నారని, సుమన్ గొంతు ప్రజా గొంతు అని, దాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. మంత్రి వివేక్ చేస్తున్న అరాచకాలు హద్దులు దాటుతున్నాయని అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులను వేధించడం, పోలీసులను ప్రయోగిస్తూ, అభివృద్ధిని విస్మరించి, కేవలం రాజకీయ కక్ష సాధింపులకే ప్రాధాన్యత ఇస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ



సమావేశంలో మాట్లాడుతున్న క్యాతన్ పల్లి బిఆర్ఎస్ నాయకులు

అరాచక పాలనకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, అభివృద్ధి మీద ఉన్న శ్రద్ధ పెట్టకుండా, ప్రతిపక్షాలను అణచివేయడం మీద దృష్టి సారించడం సిగ్గుచేటు అని అన్నారు. ఇటీవల మంచిర్యాల డీసీపీ మాట్లాడుతూ.. గొడవ జరిగినప్పుడు బీఆర్ఎస్ కార్యకర్తలు 500 మంది ఉన్నారని, కాంగ్రెస్ వాళ్ళు కేవలం 30 మంది మాత్రమే 3 కార్లలో వచ్చారని, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలదే తప్పు అన్నట్లుగా ఏక పక్షం మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తున్న ఆ 50 కార్ల కాన్వాయ్ ఎవరిదని? వివేక్ వెనుక వచ్చిన ఆ వాహనాలన్నీ ఎక్కడి నుంచి వచ్చాయని? కళ్ళముందు సాక్ష్యాలు కనిపిస్తుంటే, పోలీసులు వాస్తవాలను కప్పిపుచ్చి అధికార పార్టీకి వంత పాడటం చూస్తుంటే పోలీసులు అధికార పార్టీకి లొంగిపోవడమే అని అన్నారు. ఫిబ్రవరి 17న మున్సిపాలిటీ కార్యాలయంలో కౌన్సిలర్‌ల ప్రమాణ స్వీకారం అనంతరం జరిగిన సంఘటనకు సంబంధించిన సీసీ టివి ఫుటేజ్‌లను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అన్యాయం ఎప్పుడూ గెలవదని, బాల్క సుమన్ సగర్వంగా విడుదలవుతున్నాడని అన్నారు. ధర్మం వైపు ఉన్న మా నాయకుడు బాల్క సుమన్‌ను ఆపడం ఎవరి వల్లా కాదని, సీపిఐ పార్టీ, బిఆర్ఎస్ పార్టీలతో పాటు ప్రజానీకం అంతా ఏకతాటిపై నిలబడి బలాన్ని చాటుతున్నారని అన్నారు. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని, బాల్క సుమన్ నాయకత్వంలో మా పోరాటం కొనసాగుతుందని, ఎన్ని అరెస్టులు చేసినా, ఎన్ని అరాచకాలు చేసిన నిత్యం ప్రజల కోసం పని చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌లు బోయినిపల్లి అనిల్ రావ్, రెవెల్లి ఓదెలు, జిలకర మహేష్, నాయకులు పిల్లి సతీష్ యాదవ్, కంది క్రాంతి, గడ్డం రాజు, రవీంద్ర మూర్తి, చంద్రమోళి, తీగల రమేష్‌లు పాల్గొన్నారు.



కృతజ్ఞత సభలో పాల్గొన్న 59 వ డివిజన్ కార్పొరేటర్,ఎమ్మెల్యే దంపతులు

## 59వ డివిజన్ కార్పొరేటర్ ప్రజా కృతజ్ఞత సభలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

**మంచిర్యాల, మార్చి 1, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 59వ డివిజన్ కార్పొరేటర్ మాదంశెట్టి సత్యనారాయణ 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రజా కృతజ్ఞత సభను నిర్వహించారు. ఈ వేడుకకు మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాదంశెట్టి సత్యనారాయణ-రమాదేవి దంపతులను ఎమ్మెల్యే దంపతులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ సత్యనారాయణ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, మాజీ చైర్మన్ మంగీలాల్, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర రైతులు నిఘా పెట్టాలి

**తాండూర్, మార్చి 1, ప్రభాతవార్త :**

రైతులు తమ పొలాల్లోని వ్యవసాయ బోర్లకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర నిఘా పెట్టాలని తాండూర్ మండల విద్యుత్ శాఖ ఏఈ జాన్ కోరారు. మండలంలో గుర్తు తెలియని దొంగల ముఠా సభ్యులు రాత్రి వేళల్లో వ్యవసాయ భూముల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని విలువైన రాగి, అల్యూమినియం తీగలు ఎత్తుకెళ్తున్నారని అన్నారు.దీంతో రైతుల వ్యవసాయ పంటలకు నీరందక పంటలు ఎండిపోయి ఆర్థికంగా నష్టపోతున్నరని అన్నారు. రైతులు వ్యవసాయ భూముల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ముందస్తు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## సమాజ మార్పుకే సమాచార హక్కు చట్టం వినియోగించాలి

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 1, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్‌లో సమాచార హక్కు రక్షణ చట్టం-2005 సొసైటీ సమావేశం ఆదివారం వంగరి ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ ట్రైనర్ అష్రఫ్, సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కొండగుర్ల కమలాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని సమాజంలోని రుగ్మతల నివారణకు, పారదర్శకత పెంపుకు వినియోగించాలని సూచించారు. కొంతమంది ప్రజా సమాచార అధికారులు సకాలంలో సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, చట్టబద్ధ గడువులో వివరాలు అందించాలని కోరారు. ఈ చట్టం సామాన్యుని వజ్రాయుధమని, ప్రభుత్వ పథకాల నిధుల వివరాలు తెలుసుకోవడానికి ఇది కీలకమని తెలిపారు. చట్టాన్ని దుర్వినియోగం చేయవద్దని హెచ్చరించారు. సమావేశంలో రామ్టెంకి కృష్ణ,కస్తూరి అచలేష్,రాజలింగు, కిరణ్, కిషోర్, రవిదాస్, శ్రీనివాస్, తిరుపతి, నాగేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ ట్రైనర్ అష్రఫ్, సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కొండగుర్ల కమలాకర్



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

## విద్యార్థినికి ఘన సన్మానం

**జన్నారం, మార్చి 1, ప్రభాతవార్త**

ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి గెలిచిన కిష్టాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థిని ఏ. అనన్య, గైడ్ టీచర్ కొట్టె రాజన్న శుక్రవారం నాడు హైదరాబాద్‌లో ఎస్సీ ఈఆర్‌టి డైరెక్టర్ రమేష్ చేతుల మీదుగా మెమెంటో తో పాటు సర్టిఫికెట్ అలాగే మూడు వేల రూపాయల నగదు బహుమతి అందుకున్నారు అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ ర్యాంక్ సాధించి పాఠశాలకు మరోసారి రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చిందని విద్యార్థిని ఏ.అనన్యను, గైడ్ టీచర్ కొట్టె రాజన్నను అభినందించారు.శనివారం నాడు పాఠశాలలో జరిగిన జాతీయ స్థాయి సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలను సందర్శించిన జన్నారం ఎఫ్‌డివో రామ్ మోహన్ చేతుల మీదుగా విద్యార్థిని అనన్యను, విద్యార్థిని తల్లిదండ్రులను, గైడ్ టీచర్ కొట్టె రాజన్నను ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించడం చాలా గొప్ప విషయమని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్య, గ్రామ సర్పంచ్ వాసాల నరేష్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మంగా, పాఠశాల ఉపాధ్యాయులు దాముక కమలాకర్, జాడి మురళి, గోవర్ధన చారి, బుచ్చి లింగయ్య, ప్రకాశ్, నాగేష్, మణెమ్మ, నరహరి శర్మ, వాసు, అశోక్, జ్యోతిశీల, కాంతయ్య, రజిత రాణి, సుస్మిత, అజీమ్, స్వప్న, గ్రామస్తులు అభినందించారు.



వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న ఎస్ హెచ్ ఓ బాలాజీ వరప్రసాద్

## వాటర్ ప్లాంట్లలో పరిశుభ్రతను పాటించాలి

**ఆసిఫాబాద్, మార్చి 1, ప్రభాతవార్త:**

వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ప్లాంట్లలో పరిశుభ్రతను పాటించాలని ఎస్హెచ్ ఓ బాలాజీ వరప్రసాద్ సూచించారు. ఆసిఫాబాద్ పట్టణంలోని మినరల్ వాటర్ ప్లాంట్లపై ఆదివారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణ పరిధిలో ఉన్న 13 మినరల్ వాటర్ ప్లాంట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్హెచ్ఓ మాట్లాడుతూ వేసవి కాలం నేపథ్యంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ప్లాంట్‌లో లైసెన్స్‌లు, నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహించాలంటే తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే లైసెన్స్ కలిగి ఉండాలని, లైసెన్స్ లేకుండా ప్లాంట్ నడిపితే వాటిని సీజ్ చేసి నిర్వాహకులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా నాణ్యత ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో పోలిస్ సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**తాండూర్, మార్చ్ 1, ప్రభాతవార్త**




మండలంలో ఆదివారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమరుల చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో 1994 జులై 7న ప్రకాశం జిల్లా ఈదిమూడి గ్రామంలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ ఉద్యమం మొదలైందన్నారు.ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ ఉద్యమంలో ఎందరో మాదిగలు అమరులైనారని, వారి ఆత్మ బలిదానాలతోనే వర్గీకరణ సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అయిల్ల గణేష్, ప్రవీణ్, మహేష్, రాహుల్, మనోహర్, గట్టయ్య, వెంకట్, భాస్కర్, సామ్యూల్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి

# క్రికెట్ పోటీలు యువతకు స్ఫూర్తిదాయకం

బెల్లంపల్లి, మార్చి 01, ప్రభాతవార్త

జంగపల్లి ఎర్రయ్య స్మారకార్థం బెల్లంపల్లి మండలం దుగినెపల్లి గ్రామంలోని క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రికెట్ పోటీలను రాష్ట్ర టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగపల్లి ఎర్రయ్య స్మారకార్థం క్రికెట్ పోటీలు ఇక్కడ నిర్వహించడం అభినందనీయమన్నారు. యువకులు గంజాయి ఇతర మత్తు పానీయాలకు అలవాటు కాకుండా అంతర్జాతీయ క్రీడా క్రికెట్ పట్ల ఆసక్తి పెంచుకొని మండల, జిల్లా, జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జుమ్మిడి బానయ్య, బట్వన్ పల్లి సర్పంచ్ సంగతి రాజేష్, యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోమాస శ్రీకాంత్‌లు మాట్లాడారు. 15 రోజుల పాటు ఇక్కడ క్రికెట్ పోటీలు జరుగుతాయని వారు పేర్కొన్నారు. క్రమ శిక్షణతో గెలుపు ఓటములను స్ఫూర్తిగా తీసుకొని గెలుపు కోసం పోరాడాలాని పిలుపునిచ్చారు. ఈ పోటీల ఆర్గనైజర్ జంగపల్లి ఎర్రయ్య పెద్ద కుమారుడు జంగపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ క్రికెట్ పోటీలకు 40 జట్లు హాజరయ్యాయని తెలిపారు. నిర్ణీత 10 ఓవర్ల లక్ష్యంతో టాస్ గెలిచి బ్యాటింగ్ పట్టిన నెన్నెల మండలం గొల్లపల్లి జట్టు 76 రన్స్ చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేపట్టిన పెర్కపల్లి జట్టు 60 రన్స్ కే ఆల్ అవుట్ అయింది. 16 రన్స్ తేడాతో గొల్లపల్లి జట్టు పెర్కపల్లి జట్టుపై గెలుపొందినట్లు తెలిపారు. ఈ క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 20 వేల రూపాయల నగదు, రెండో బహుమతి 15000 రూపాయల నగదు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జన్నారం, మార్చి 1, ప్రభాతవార్త

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గుగ్గులావత్ సంగీతా రవి నాయక్, వైద్య శిబిరం నిర్వాహకులు చిందం చంద్రయ్య అన్నారు. ఆదివారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో కరీంనగర్ సన్ రైజ్ హాస్పిటల్ యజమాని నూతి వెంకటేష్, చందు సహకారంతో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో గ్రామంలోని ప్రజలకు డాక్టర్ రమణి, డాక్టర్ దేవా శ్రీను ఆధ్వర్యంలో 152 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అలాగే సమస్య తీవ్రంగా ఉన్న వారిని గుర్తించి కరీంనగర్ ఆసుపత్రికి వస్తే వారికి ఉచితంగా చికిత్సలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు జాడి గంగాధర్, తిమ్మాపూర్ ఉప సర్పంచ్ వేముల నాగేష్, డైరెక్టర్ ప్రదీప్ నాయకులు జునుగురి మల్లయ్య, చిందం శ్రీనివాస్, దేవ రాజమౌళి వార్డు సభ్యులు బోర్లకుంట శివశంకర్, చిందం స్వప్న, పెరుగు కృష్ణవేణి, అజ్మీరా దేవిక, డాక్టర్ మల్లేష్ గోవింద నాయక్ , ప్రోగ్రాం మేనేజర్ కొంతం రాజశేఖర్, కోఆర్డినేటర్ సతీష్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.



# రిటైర్డ్ ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం

జన్నారం, మార్చి 1, ప్రభాతవార్త

గత పదహారు సంవత్సరాలుగా ఆర్మీ లో విధులు నిర్వహించి రిటైర్‌మెంట్ తీసుకుని స్వగ్రామానికి విచ్చేసిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ గోనె ప్రభాకర్‌కు ఘన స్వాగతం పలికారు. జన్నారం మండలం రోటిగూడెం గ్రామానికి చెందిన గోనె ప్రభాకర్ పదహారు సంవత్సరాల నుండి ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. రిటైర్మెంట్ తప్పనిసరి కాబట్టి ఆర్మీ జవాన్ గోనె ప్రభాకర్ స్వగ్రామానికి ఆదివారం నాడు తిరిగి వచ్చిన సందర్భంగా గ్రామస్తులు వాహనానికి పూలతో అలంకరించి జన్నారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి మీదుగా భారీ ఊరేగింపు నిర్వహించి, ర్యాలీ చేపట్టి టపాకాయలు కాలుస్తూ జయహో జవాన్ అంటూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం రిటైర్డ్ ఆర్మీ జవాన్ గోనె ప్రభాకర్ అంబేద్కర్ కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల మాల వేసి నివాళులు అర్పించారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

# రెండు నెలలుగా ఎస్సై పోస్టు ఖాళీ..

### భర్తీ చేయని ఉన్నతాధికారులు..

తాండూర్, మార్చి 1, ప్రభాతవార్త :

తాండూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పోస్టు గత రెండు నెలలుగా ఖాళీగా ఉంది. ఇక్కడ ఎస్సైగా పని చేసిన కిరణ్ కుమార్ మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు. అప్పటి నుండి ఎస్ఐ పోస్టును పోలీసు ఉన్నత అధికారులు భర్తీ చేయలేదు. తాండూర్ మండలంలోని మాదారం ఎస్సై సౌజన్య ఇన్చార్జిగా ఎస్సైగా కొనసాగుతున్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్, బెల్లంపల్లి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో పని చేస్తున్న పలువురు ఎస్సైలు తాండూర్ ఎస్సైగా పని చేసేందుకు రాజకీయ నాయకులు, పోలీసు ఉన్నతాధికారుల వద్ద తమ స్థాయిలో పైరవీలు చేశారు. దీంతో ఖాళీగా ఉన్న ఎస్ఐ పోస్టు కొన్ని రోజులలోనే భర్తీ అవుతుందని అందరూ భావించారు. కానీ ఎప్పుడు లేని విధంగా తాండూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పోస్టు రెండు నెలలుగా ఖాళీగా ఉండడంతో ప్రజలు, పోలీసులలో చర్చనీయాంశంగా మారింది. ఖాళీగా ఉన్న తాండూర్ ఎస్ఐ పోస్టును ఉన్నతాధికారులు వెంటనే భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# డిప్యూటేషన్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

### సింగరేణి యాజమాన్యం నిర్ణయంపై హెచ్ఎంఎస్ ఆగ్రహం

నస్పూర్, మార్చి 1, ప్రభాతవార్త

ఐదు ఏళ్లుగా వివిధ విభాగాల్లో డిప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తున్న కార్మికులను అదే స్థానాల్లో శాశ్వతంగా కొనసాగించాలని హెచ్ఎంఎస్ అధ్యక్షులు తిప్పారపు సారయ్య డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని వర్క్ షాప్, ఓసిపి, ఇతర సర్ఫేస్ విభాగాల్లో పనిచేస్తున్న 42 మంది కార్మికుల డిప్యూటేషన్లను రద్దు చేస్తూ సింగరేణి యాజమాన్యం జారీ చేసిన ఉత్తర్వులను సంఘం తీవ్రంగా వ్యతిరేకించింది. ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హెచ్ఎంఎస్ నేతలు తిప్పారపు సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి పొన్నగంటి అశోక్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ దుర్గం లక్ష్ముుుుు ్మణ్ ఈ నిర్ణయాన్ని ఖండించారు. ఐదేళ్లకు పైగా వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న కార్మికులను అదే స్థానాల్లో పర్మినెంట్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని నేతలు కోరారు. ఈ విషయంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు స్పందించకపోవడంపై వారు అసహనం వ్యక్తం చేశారు. డిప్యూటేషన్ పై ఉన్న వారిలో గతంలో గని ప్రమాదాలకు గురైన వారు కూడా ఉన్నారు. అటువంటి వారికి గతంలో సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ పోస్టులు ఇవ్వడంలో యాజమాన్యం, గుర్తింపు సంఘాలు పక్షపాత ధోరణి ప్రదర్శించాయని ఆరోపించారు. డిప్యూటేషన్లు రద్దు చేయడం వల్ల కార్మికులు మధ్యవర్తులను ఆశ్రయించాల్సి వస్తుంది. దీనివల్ల లక్షలాది రూపాయలు చేతులు మారే ప్రమాదం ఉంది. ప్రమాదాలకు గురైన కార్మికులను గుర్తించి వారికి బేశరతుగా సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ పోస్టులు ఇవ్వాలని నేతలు డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘాలు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. కార్మికులకు న్యాయం జరగని పక్షంలో హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

